## క్లుప్తంగా

### ప్రభుత్వం ఆదుకోవాలి

ఐనవోలు : గొర్రెలు, మేకల పెంపకందారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా గొర్రెల, మేకల పెంపకందారుల సహకార సంఘాల మాజీ చైర్మన్ మేకల కేదారి కోరారు. వనమాల కనపర్తిలో ఇటీవల మేకలు మృత్యువాత పడగా మంగళవారం బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. అప్పుడే మొలసిన నామును తిన్న 33 మేకలు మృత్యువాత పడినట్లు అనుమానించారు. వీటి విలువ సుమారు 5లక్షల వరకు ఉంటుందన్నారు. జక్కుల సారయ్యకు చెందిన 8, జక్కుల అశోక్‌కు చెందిన 6, జక్కుల సారయ్యకు చెందిన 5, చల్లా ఐలయ్యకు చెందిన 3, చల్లా వెంకటమ్మకు చెందిన 2, జక్కుల ప్రశాంత్‌కు చెందిన 6 మృతి చెందాయని తెలిపారు. పశుసంవర్థక శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించిన ఆదుకునే విధంగా కృషి చేయాలని కోరారు. జక్కుల రవి, బోయిన వెంకన్న, దాసరి చేరాలు, అర్కాల కుమారస్వామి, బండి వెంకటస్వామి, దద్దుబాల కొంరయ్య, ఉక్కులయ్య, చంద్రయ్య, పెద్దకొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

### వివాహిత ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు



పరకాల : మండలంలోని పోచారం గ్రామానికి చెందిన వివాహిత జూపాక జ్యోతిని అదనపు కట్నం కోసం వేధించి ఆమె ఆత్మహత్యకు కారణమైన ముగ్గురిని స్థానిక పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ మేరకు ఏసీపీ కిశోర్‌కుమార్ పరకాల పోలీస్ స్టేషన్‌లో అరెస్టు వివరాలను వెల్లడించారు. పోచారం గ్రామానికి చెందిన జ్యోతిని అదే గ్రామానికి చెందిన ప్రశాంత్‌కు ఇచ్చి రెండేళ్ల క్రితం వివాహం జరిపించారు. కాగా అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్తా, మామలు అహల్య, రవి వేధించేవారు. ఈ క్రమంలో ఇంట్లో జరిగిన గొడవతో మనస్థాపం చెందిన జ్యోతి ఈనెల 19వ తేదీన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్యకు కారణమైన మృతురాలి భర్త ప్రశాంత్‌తో పాటు అత్తా, మామాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. సీఐ రవిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజుల వసూలు

నర్సంపేట : మండలంలోని పలు ప్రైవేట్ స్కూళ్లలో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఏఐఎఫ్‌డీఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మార్త నాగరాజు తెలిపారు. సదరు పాఠశాలల యాజమాన్యాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, విద్యాశాఖ ఉన్నతాధికారులను ఆయన డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో నాగరాజు మాట్లాడారు. పలు ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయని తెలిపారు. యూనిఫామ్స్, వేసవి తరగతుల పేరుతో అదనంగా ఫీజు వసూలు చేస్తూ ప్రైవేటు పాఠశాలల్లో మార్కుల శాతం రాకున్నా వచ్చినట్లు కరపత్రాలు తయారు చేసి గ్రామాల్లో పంచుతున్నారని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై విద్యాశాఖ అధికారుల్లు చర్యలు తీసుకోవడం లేదన్నారు. సమావేశంలో నాయకులు వంశీ, ఈశ్వర్, రాకేశ్, బన్నీ, అనిల్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ కళాశాలల్లోనే ఉత్తమ విద్యాబోధన

గీసుకొండ : ప్రభుత్వ కళాశాలల్లోనే ఉత్తమ విద్యాబోధన లభిస్తుందని మండలంలోని కొనాయమాకుల గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.కుమార్ తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆ కళాశాలలోని ఇంటర్మీడియేట్ తెలుగు, ఇంగ్లిష్ మీడియం మొదటి సంవత్సరం కోర్సుల్లో చేరాలని కోరుతూ ఆ కళాశాల అధ్యాపకులు మండలంలోని పలు గ్రామాల్లో, గ్రేటర్ వరంగల్ పరిధిలో మంగళవారం ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కుమార్ మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరి సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. జూన్ 1వ తేదీ నుంచి కళాశాల ప్రారంభం అవుతుందని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల మోసపూరిత ప్రచారానికి ఆకర్షితులు కావద్దని చెప్పారు.

### నేడు ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం

గీసుకొండ : మరియపురంలోని నక్షత్ర ఫంక్షన్ హాల్‌లో బుధవారం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉపఎన్నికల ప్రచార సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15, 16 డివిజన్లతోపాటు మండలంలోని అన్ని గ్రామాల ముఖ్యనాయకులు పాల్గొనాలని కోరారు. ఉదయం 8 గంటలకు జరగనున్న సమావేశంలో ఉంటుందని తెలిపారు.

# నిర్మాణ దశలోనే శిథిలావస్థకు..

- పశువుల కొట్టంగా మహిళా సమాఖ్య భవనం
- ఆకతాయిలకు అడ్డాగా కమ్యూనిటీహాల్, అంగన్‌వాడీ కేంద్రం
- త్వరగా పూర్తిచేయాలని ప్రజల విజ్ఞప్తి



ఊరుగొండలో పశువుల కొట్టంగా మహిళా సమాఖ్య భవనం

దామెర : మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రభుత్వ కార్యాలయ భవనాలు నిర్మాణ దశలోనే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. లక్షలు వెచ్చించి భవన నిర్మాణాలు చేపట్టినా మధ్యలోనే వదిలేయడంతో ప్రజాధనం వృథా అవుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దుర్గంపేటలో గౌడ సంఘం కమ్యూనిటీహాల్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి 2017 సంవత్సరంలో రూ.25లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించిన అనంతరం స్లాబ్ వరకు పనులు పూర్తిచేసి గోడలు నిర్మించకుండా సదరు కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశాడు. దీంతో ఆ భవనం ఆకతాయిలకు అడ్డాగా మారుతోంది. అందులో మందుబాబులు రాత్రి వేళల్లో మద్యం సేవిస్తున్నారు. అధికారులు చొరవచూపి భవన నిర్మాణాలు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

**ఊరుగొండలో మహిళా సమాఖ్య భవనం**

మండలంలోని ఊరుగొండలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి 2017 సంవత్సరంలో రూ.25 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. ఈ భవన నిర్మాణం కూడా స్లాబు పనుల వరకు పూర్తికాగా, గోడలు మాత్రం పూర్తి చేయకుండానే పనులు నిలిచిపోయాయి. దీంతో ఈ భవనం కాస్త గొర్రెల కొట్టంగా మారింది. మహిళా సమాఖ్య సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవాలంటే ఇబ్బందులు తప్పడం లేదని, త్వరగా సమాఖ్య భవనం పూర్తి చేయాలని మండలంలోని మహిళలు కోరుకుంటున్నారు.

**అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రం**

మండలంలోని తక్కళ్లపహాడ్ గ్రామంలో 12 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. స్లాబ్‌లెవల్ వరకు పనులుపూర్తి చేశారు. అనంతరం పనులు నిలిపి వేయడంతో నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరకుంది. నిర్మాణ పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అసంపూర్తిగా గౌడ కమ్యూనిటీ హాల్

### వెంటనే పూర్తిచేయాలి

గౌడ కమ్యూనిటీహాల్, మహిళా సమాఖ్య భవనం, అంగనవాడీ కేంద్రాల నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలి. పనులు మధ్యలోనే నిలిపివేయడంతో ఆకతాయిలు రాత్రి సమయంలో మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మార్చుకుంటున్నారు. అధికారులు చొరవతీసుకొని భవన నిర్మాణాలు వెంటనే పూర్తిచేయాలి. లేకుంటే నిర్మాణదశలోనే నేలమట్టం అయ్యే ప్రమాదం ఉంది. ఏళ్లుగా అసంపూర్తిగా ఉంటూ ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో ప్రజాధనం వృథా అవుతుంది. పాలకులు, అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.



- జంగిలి నాగరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు

# యువత మత్తు మాయలో పడొద్దు

- అవగాహన సదస్సులో ఎస్సై

ఎల్కతుర్తి : మండలంలోని యువకులు వ్యసనాలకు బానిసలై మత్తు మాయంలో పడొద్దని, బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్సై సాయిబాబు సూచించారు. మంగళవారం భీమదేవరపల్లి మండలం బొల్లోనిపల్లిలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, బాల్య వివాహాలు, బాలకార్మికుల నిర్మూలన, సీసీ కెమెరాల వినియోగంతో కలిగే ప్రయోజనాలతోపాటు గుట్కా, గంజాయ్, డ్రగ్స్ వలన కగిలే అనర్థాలను వివరించారు. వృద్ధ తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. జాగృతి పోలీస్ కళా బృందంచే పాటల, సైబర్ క్రైమ్స్ నాటిక ద్వారా 1930 సైబర్ టోల్ ఫ్రీ నంబర్ గురించి అవగాహన కల్పించారు. అపదలో ఉన్న వారు డయల్ 100కి ఫోన్ చేయాలని సూచించారు. ముఖ్యంగా యువత చెడు మార్గంలో పయనించొద్దని, చదువుపై దృష్టి సారించాలని అన్నారు. మద్యం, సిగరేట్, గుట్కా, గంజాయి వంటి వ్యవసానాలకు దూరంగా ఉండాలని అన్నారు. మత్తు మాయలో పడినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. యువకులు గ్రామ అభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు కళాబృందం ఇన్‌చార్జ్ ఏఎస్సై నాగమణి, హెచ్‌సీఎస్ సభ్యులు విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, విక్రమ్, రాజు, నారాయణ, చిరంజీవి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై సాయిబాబు

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- సీఐ రవిరాజు

పరకాల: ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు అమ్మేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ రవిరాజు హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతువేదికలో మంగళవారం ఏఓ శ్రీనివాస్ అధ్యక్షతన ఎరువులు, పురుగుల మందులు, విత్తన షాపుల డీలర్లు, వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నకిలీ విత్తనాలతో పాటు ప్రభుత్వం నిషేదించిన పత్తి విత్తనాలు (హెచ్‌టీ) బీజీ-3 అమ్మేవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదే విధంగా ప్రతి డీలర్ తమ లైసెన్స్‌ను కనిపించేంలా దుకాణంలో ప్రదర్శించాలని కోరారు. స్టాక్ బోర్డుతో పాటు రిజిస్టర్‌ను సక్రమంగా వినియోగించాలని కోరారు. డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యదేవర సదానందం, కార్యదర్శి పెండ్యాల విక్రమ్‌రెడ్డి, కోశాధికారి గందె రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ రవిరాజు

# అసంపూర్తి పనులు.. పూర్తయ్యేదెప్పుడు



రోడ్డు పక్కన మురుగునీరు, డివైడర్లు లేని రోడ్డు



రోడ్డు మధ్యలో వదిలేసిన విద్యుత్ స్తంభం

ఆత్మకూరు : మండలంలోని కామారంలో సుమారు 500 కుటుంబాల వరకు నివసిస్తాయి. గ్రామంలో ఏడాది క్రితం సీసీరోడ్డు వేశారు. కానీ సైడ్ డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా గ్రామంలో సీసీ రోడ్డు నిర్మించే సమయంలో విద్యుత్ స్తంభాలను తొలగించలేదు. దీంతో రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డుపై ప్రయాణిస్తున్నామని ఆగ్రహిస్తున్నారు. సీసీ రోడ్డు మధ్యలో డివైడర్లు నిర్మించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని, ఇప్పటికైనా అసంపూర్తి పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి



ఐనవోలు /దామెర : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఎనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని ఐనవోలు మండల ఇన్‌చార్జ్ గోపాల్ రావు, దామెర మండలం ఊరుగొండ మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి కోరారు. మంగళవారం వేర్వేరుగా ప్రచారం, సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 23వ తేదీన వర్ధన్నపేట నియోజకవర్గం ఎమ్మెల్సీ సన్నాహక సమావేశానికి మండలం నుంచి 300 మందిని తరలించాలని కార్యకర్తలకు సూచించారు. ఐనవోలు వైస్ ఎంపీపీ మోహన్, సొసైటీ వైస్ చైర్మన్ పాల్గొన్నారు.

# రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



ముల్కనూరులో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



కమలాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



కమలాపూర్ : పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



శాయంపేటలో..

ఎల్కతుర్తి : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా మంగళవారం ఎల్కతుర్తి మండల కేంద్రంతోపాటు భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు, కొత్తకొండలో ఉత్సవాలు నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ ఆశయాలను కొనసాగించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, సంతాజీ, నాయకులు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, గోలి రాజేశ్వర్‌రావు, చల్లా రమణారెడ్డి, మండ సుమన్ గౌడ్, గుడెల్లి నవీన్, కడారి సురేందర్, శనిగరం వెంకటేష్, పాక రమేష్, శీలం అనిల్, హింగె శ్రీకాంత్, గొర్రె మహేందర్, వెంకటేష్, కనుకయ్య, సమ్మయ్య, మొండయ్య, రాజమౌళి పాల్గొన్నారు.

**శాయంపేటలో..**

శాయంపేట : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు తదితరులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

**కమలాపూర్‌లో..**

కమలాపూర్ : భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. రాజీవ్‌గాంధీ దేశానికి, యువతకు, ఐటీ రంగానికి చేసిన సేవలను కొనియాడారు. హుజూరాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేశ్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పోడేటి భిక్షపతి, నాయకులు శ్రీనివాస రావు, శివకృష్ణ, రాంచంద్రం, శ్రీకాంత్, రమేశ్, బాలపురి కనుకరత్నం, పర్శరాములు పాల్గొన్నారు.

# వైభవంగా రేణుకాఎల్లమ్మతల్లి బోనాలు

- ఆత్మకూరులో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



ఆత్మకూరు : కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కమలాపూర్ : వేడుకల్లో పాల్గొన్న కౌశిక్‌రెడ్డి



శాయంపేటలో..



ఎల్కతుర్తి : ముల్కనూరులో..



ఐనవోలు : వసంతోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



ఆత్మకూరు : శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కమలాపూర్ : రేణుకాఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా కమలాపూర్‌లో గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మతల్లి బోనాల వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గీత కార్మిక కుటుంబాలు ఇంటికో బోనం చొప్పున బోనాలను డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా ఎల్లమ్మ దేవాలయానికి తరలించారు. ఎల్లమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎల్లమ్మ బోనాల వేడుకలకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై మొక్కలు చెల్లించారు. గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు జేరిపోతుల శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పబ్బు కొమురయ్య గౌడ్, కోశాధికారి బాలసాని రమేశ్‌గౌడ్, డైరెక్టర్లు తోడేటి సదానందంగౌడ్, జక్కు రాజుగౌడ్, పరకాల వీరగౌడ్, దొనికెల కుమారస్వామిగౌడ్, పబ్బు రాజుగౌడ్, రాములుగౌడ్, కారోబార్ గోపాల్‌గౌడ్, మహిళలు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

**ఎల్కతుర్తిలో..**

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ములకనూరు, కొత్తపల్లితోపాటు వివిధ గ్రామాల్లో, ఎలకతుర్తి మండలంలోని దామెరలో రేణుకాఎల్లమ్మ బోనాల వేడుకలను గౌడకులస్తులు, మహిళలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. నైవేద్యంతో కూడిన బోనాలను డప్పుచప్పుళ్ల నడుమ శివసత్తుల పునకాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చెరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పిల్లాపాపలను చల్లంగా చూడు తల్లీ అంటూ వేడుకున్నారు. కుల పెద్దలు ఉమ్మగోని ప్రభాకర్, చిర్ర సుధాకర్, పాటి భగవాన్, పాటి రమేశ్, రవి, రాజు పాల్గొన్నారు.

**ఆత్మకూరులో బ్రహ్మోత్సవాలు**

ఆత్మకూరు : మండల కేంద్రంలోని మహిమాన్విత రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం నాలుగోరోజు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమం, పల్లకి సేవ నిర్వహించారు. అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు రుక్మిణీ సత్యభామసమేత వేణుగోపాలస్వామి కల్యాణం కనులపండువగా జరిపించారు. భజనమండలి భక్తులు కీర్తనలు ఆలపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని సేవించుకున్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది.

**శాయంపేటలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు**

శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం వేదమంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకుడు అరుట్ల కృష్ణమాచార్యులు, యాగ్నికులు వీరవెల్లి వేణుగోపాలచార్యులు అంకురారోహణం, విశ్వక్సేన ఆరాధన, రక్షాబంధన్ పూజ నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం, గరుడ పటం ఎగురవేసి గరుడ ముద్ర ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్‌సేనారెడ్డి, కృపాకర్‌రెడ్డి, దిడ్డి రమేశ్, కాంబత్తుల ప్రకాశ్, గన్ను వేణుగోపాల్, అనుకారి అశోక్, గొట్టిముక్కుల చంద్రప్రకాశ్, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**వైభవంగా లక్ష్మీనరసింహుడికి వసంతోత్సవం**

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి లక్ష్మీనరసింహుడి ఆలయంలో జరుగుతున్న షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం యాజ్ఞికులు రవి ఆచార్యులు నిత్యపూజల అనంతరం నిత్య హవనం, పూర్ణాహుతి, స్వామి, అమ్మవార్లకు వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఎదురుకోలు ఉత్సవం కనులపండువగా జరిగింది. ఆలయ చైర్మన్ సత్యనారాయణ, డైరక్టర్ మోహన్, అర్చకులు జయకృష్ణమాచార్య భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం కోసం భర్త ఇంటి ఎదుట ఆందోళన




రాము ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న సరిత

కమలాపూర్ : తనకు, తన కూతురుకు న్యాయం చేయాలని డిమాండ్‌చేస్తూ భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళనకు దిగింది. ఈ సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలు సరిత తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వరిస్తున్న రాముకు, హనుమకొండకు చెందిన సరితతో 2011లో వివాహం జరిగింది. కొంతకాలం వీరి కాపురం సాఫీగా సాగగా వీరికి ఒక పాప జన్మించింది. ఆ తర్వాత ఇద్దరి మధ్య వివాదాలు తలెత్తడంతో 2016లో హనుమకొండ మహిళా పోలీస్ స్టేషన్‌లో భర్తపై సరిత ఫిర్యాదు చేసింది. అనంతరం పెద్దమనుషుల సమక్షంలో రాము 6 నెలలలోపు భార్య సరితకు రూ.3.60 లక్షల నగదుతో పాటు 60 గజాల స్థలం, అప్పటి వరకు పోషణ ఖర్చుల నిమిత్తం నెలకు రూ.3 వేలు ఇవ్వాలని ఒప్పందం కుదిర్చారు. కానీ రాము ఒప్పందం ప్రకారం డబ్బులు, స్థలం ఇవ్వకుండా మొండికేశాడు. రాము ఆచూకీ కోసం తిరుగుతున్నానని, కమలాపూర్‌లోనే ఉంటున్నాడని తెలిసి తన కూతురు అంజలితో కలిసి కమలాపూర్‌కు వచ్చి అతడి ఇంటి ఎదుట ఆందోళనకు దిగినట్లు బాధితురాలు తెలిపింది. ఈ క్రమంలో రాము ఇంటి వద్ద లేకపోగా అతని కుటుంబ సభ్యులు సరితతో వాగ్వాదానికి దిగారు. అనంతరం సరిత కమలాపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఒప్పందం ప్రకారం తనకు న్యాయం చేసే విధంగా చూడాలని పోలీస్‌లను వేడుకుని రాముపై ఫిర్యాదు చేసింది. అనంతరం ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ.. సరితకు న్యాయం చేస్తామని, రాము అందుబాటులో లేడని, ఫోన్ స్విచ్చాఫ్ వస్తోందని తెలిపారు. ఇదిలా ఉండగా తాను సరితను పెళ్లి చేసుకోలేదని, ఆ పాప తన సంతానం కాదని, డబ్బుల కోసం సరిత తనను బ్లాక్‌మెయిల్ చేస్తోందని రాము ఫోన్ ద్వారా మీడియాకు తెలిపాడు.

### ఆర్థికసాయం

గీసుకొండ : మనుగొండకు చెందిన గుండ చిన్న రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.5 వేల సాయం అందించగా నగదును ఆ పార్టీ నాయకులు బాధితుడికి మంగళవారం అందించారు.

# కాంగ్రెస్‌తోనే నిరుద్యోగ సమస్య పరిష్కారం



ఖానాపురం : కాంగ్రెస్ పార్టీతోనే నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మోడెం ఎల్లాగౌడ్ స్పష్టం చేశారు. మండలంలోని బుధరావుపేటలో మంగళవారం నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో పార్టీ బలపర్చిన తీన్మార్ మల్లన్నను గెలిపించాలని శ్రేణులకు సూచించారు. గత ప్రభుత్వం అవలంభించిన ప్రజావ్యతిరేక విధానాలను నిరంతరం ఎండగట్టిన వ్యక్తిగా మల్లన్న గుర్తింపు పొందాడని చెప్పారు. పేదలకు అండగా నిలుస్తున్న మల్లన్నను యువత ఆదరించి గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు పల్స ప్రశాంత్, మహేశ్, మొలకల మురళి, నజీర్, శివ, నాగరాజు, ఉపేందర్, హనీశ్, వినోద్, అక్రమ్, ప్రకాశ్ పాల్గొన్నారు.